క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

మండపేట: దాళ్వా పంట దిగుబడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు సూచించారు. రబీ ధాన్యం కొనుగోళ్లపై సొసైటీల సీఈఓలు, వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బందితో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, ఏఓ కె.ఏసుబాబు సమావేశమయ్యారు. లోటుపాట్లకు తావు లేకుండా విజయవంతంగా కొనుగోళ్లు నిర్వహించేందుకు ప్రణాళికలపై చర్చించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు. గోనె సంచెలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం గ్రామ సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం మండల ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారై ఉండాలని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధం



అగ్నికి ఆహుతైన పశువుల పాక, ఆవు

కె.గంగవరం: మండలంలోని కుందూరు శివారు కుందూరులంకలో శుక్రవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పలివెల వెంకటరమణకు చెందిన రెండు ఒంగోలు జాతి ఆవులు మృతి చెందాయి. ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి ఎంపీపీ నాగమణి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.లక్ష 50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందేలా చూస్తామని బాధితుడికి భరోసా ఇచ్చి పరామర్శించారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, కంటి చికిత్స నిపుణులు

కపిలేశ్వరపురం: కంటి చూపును దెబ్బతీసే గ్లకోమా వ్యాధిపై అందరికీ అవగాహన అవసరమని కపిలేశ్వరపురంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రం నిపుణులు అన్నారు. గ్రామంలో శుక్రవారం కంటి పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆసుపత్రి నిపుణులు గ్రామ వీధుల్లో నినాదాలతో ర్యాలీ చేశారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎల్‌వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రం సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

గ్లకోమా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: వయస్సు పైబడిన వారికి తరచూ సంభవించే గ్లకోమా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీ శంకర్, నేత్ర వైద్య నిపుణురాలు కె.శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ఎస్‌బీపీబీకె కల్యాణ మండపంలో శుక్రవారం గ్లకోమా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. తీవ్రమైన కంటినొప్పి, తలనొప్పి, వికారం వాంతులు కాని సంభవిస్తే సత్వరమే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అలాగే చూపు మందగించినా, వెలుతురు చుట్టూ రంగుల వలయాలు ఏర్పడినా కంటి వైద్య నిపుణులు వద్ద చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం గ్లకోమా వ్యాధిపై అవగాహన కలిప్తూ ర్యాలీ నిర్వహించారు. ఏదైనా వ్యాధికి చికిత్స చేయించుకుని యాంటీబయాటిక్స్ వాడితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్‌ఈ ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు ద్విభాష్యం రవికృష్ణశర్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ గాత్ర కచేరిలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని చిట్టూరి రాధ పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. సరస్వతి నమోస్తుతే, శంకరాభరణం, మోహన రాగం ఆదితాళం తదితర రాగాలు భక్తులను అలరించాయి. అనంతరం గాయని రాధను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

ప్రగతి పథంలో రామచంద్రపురం మున్సిపాలిటీ

- రూ.75 కోట్లతో అభివృద్ధి పనులు
- నేటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న పాలక వర్గం
- రూ.40 కోట్ల ప్రత్యేక నిధులతో ప్రణాళికలు

రామచంద్రపురం: స్థానిక మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ప్రగతి పథంలో నేటితో రెండేళ్లు పూర్తి చేసుకుంది. గతానికి భిన్నంగా ప్రస్తుత కౌన్సిల్ అభివృద్ధి దిశగా పయనిస్తూ పట్టణంలోని పలు సమస్యలపై పరిష్కార చర్యలను తీసుకుంటూ ఏప్రిల్-2022 నుంచి మార్చి 2023 వరకు రూ.75 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులను పూర్తి చేశారు. మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో మున్సిపాలిటీలోని 28 వార్డులకుగాను 10 వార్డుల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా గెలవగా మరో 14 వార్డుల్లో ఎన్నికల్లోను విజయం సాధించి తిరుగులేని మెజార్టీని సాధించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాపు సామాజిక వర్గానికి చెందిన గాధంశెట్టి శ్రీదేవిని, వైస్ చైర్మన్‌గా మాదిగ సామాజికవర్గానికి చెందిన కోలమూరి శివాజీని పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది.

రెండేళ్లలో అభివృద్ధికి చర్యలు

కౌన్సిల్ పాలక వర్గం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే సుమారుగా రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. శివారు ప్రాంతాల్లోని నూతనంగా ఏర్పడిన ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు పూర్తి చేశారు. రెండో ఏడాదిలో రూ.75 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిని ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని నిధులు కలసి రూ.75 కోట్ల 71లక్షల నిధులు ఖర్చు చేశారు. మూడో ఏడాదికి సంబంధించి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ పథకాల నిధులతో పాటుగా ప్రత్యేక నిధులు రూ.40 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. నూతనంగా రూ.1.25 కోట్లతో రైతు బజార్ నిర్మాణానికి ఇప్పటికే నిధులు రాగా ఈ ఏడాది నిర్మించనున్నారు. పట్టణాన్ని గ్రీన్ జోన్‌గా మార్చేందుకు ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేశారు.



సీసీ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

ఈ ఏడాది ఖర్చు చేసిన వివిధ పథకాల నిధులు ఇలా..		
టీపీఎస్ నిధులు	:	రూ.11,06824
ఎస్‌సీఎస్‌పీ గ్రాంటు	:	రూ.56,0258
వైఎస్సార్ అర్బన్ క్లినిక్ సెంటర్ గ్రాంటు నిధులు	:	రూ.76,80,985
14వ ఫైనాన్స్ నిధులు	:	38,71,2433
15వ ఫైనాన్స్ నిధులు	:	రూ.14,26,9348
మున్సిపాలిటీ జనరల్ నిధులు	:	రూ.8,34,4697
మొత్తం నిధులు	:	రూ.75,71,7145

గ్రీన్ జోన్‌గా మున్సిపాలిటీ



పట్టణాన్ని పచ్చదనంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. ప్రతి ఇంటికీ కుళాయి అందించాన్నదే మా లక్ష్యం. ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ సభ్యులు ప్రజలతో మమేకం అవుతూ సమస్యలపై దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యలను గుర్తించి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రి

సంక్షేమంతో పాటు అభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా మున్సిపాలిటీలో అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నాం. వివిధ పథకాల ద్వారా వచ్చిన గ్రాంట్లను సక్రమంగా వినియోగించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు వేస్తున్నాం. మంత్రి వేణుగోపాలకృష్ణ సహకారంతో మున్సిపాలిటీని రెండేళ్ల నుంచి అభివృద్ధి పథంలో తీసుకువెళుతున్నాం.

– గాధంశెట్టి శ్రీదేవి, చైర్ పర్సన్

రహదారి విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు విస్తరణలో భాగంగా మార్జిన్‌లో ఉన్న ఇళ్లను తొలగిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం నుంచి పాణింగపల్లి వెళ్లే రహదారి పనులను అధికారులు శుక్రవారం చేపట్టారు. ప్రస్తుతం రహదారిని ఇరువైలా విస్తరించే పనులు చేస్తుండటంతో రహదారి నిర్మాణానికి స్థలం అవసరమయింది. గతంలో వెలంపాలెం పరిధిలో ఈ రహదారిని అనుకుని 1989లో తాత్కాలిక పట్టాలు ఇవ్వటంతో అప్పట్లో 22 గృహాలను నిర్మించుకున్నారు. రహదారి పక్కనే ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. గృహాలు కోల్పోయిన వారందరికీ ప్రస్తుతం ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. దీంతో రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న ఇళ్లను కార్యదర్శి ఆచారి పోలీసుల ఆధ్వర్యంలో జేసీబీతో తొలగింపు పనులను శుక్రవారం చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణతో ఎప్పటి నుంచో ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది.

గృహ నిర్మాణాల పురోగతిపై అధికారుల సమీక్ష



హౌసింగ్ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తున్న పీడీ బాబురావు, అధికారులు

మండపేట: పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ బాబురావు సూచించారు. మండపేట అర్బన్, రూరల్‌లో గృహనిర్మాణాల ప్రగతిపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం కోసం అన్నివిధాలుగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును లబ్ధిదారులకు వివరించడం ద్వారా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. డీఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అర్బన్, రూరల్‌లోని 35 సచివాలయాల పరిధిలో 6,582 ఇళ్లకు గాను 944 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 1,876 బీబీఎల్, 3,325 బీఎల్, మిగిలినవి ఆర్‌సీ లెవిల్‌లో ఉన్నాయని వివరించారు. ప్రత్యేకాధికారి ఓ రామకృష్ణ, ఎంపీడీఓ ఐ రాజు, ఈఈ వై శ్రీనివాస్, ఏఈలు దాసు, కేవీ రామారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా

కాజులూరు: యానం, ద్వారపూడి ప్రధాన రహదారిలో కాజులూరు మండలం కోలంక వద్ద శుక్రవారం సాగునీటి కోసం రైతులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోలంక నీటి సంఘాల మాజీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబురాజు, దాట్ల విజయగోపాలరాజు, రైతు సంఘాల నాయకులు నిర్వహించారు. తాళ్లరేవు ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్‌కుమార్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో రైతులు శాంతించారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తనయుడు చెల్లుబోయిన నరేన్

కె.గంగవరం: మండల పరిధిలోని పాణింగపల్లి గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.11 లక్షలతో నిర్మించబోయే ఈ డ్రైనేజీకి మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్, ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ గతంలో గ్రామంలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు దృష్టికి డ్రైనేజీ సమస్యలు గ్రామస్తులు తీసుకువెళ్లారన్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి మంత్రి వేణు నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, గ్రామ పెద్దలు నీతిపూడి వెంకట్రావు, చీకట్ల గోపాలం, వైట్ల అచ్యుతరామయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

480 పశువులకు గాలికుంటు టీకాలు



పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ అనిత

కపిలేశ్వరపురం: వేసవిలో పశువులను శాస్త్రీయ పద్ధతిలో సంరక్షించుకోవాలని పశు సంవర్థక శాఖ విజయవాడ వీబీఆర్‌ఐ ఏడీ కె.వాణిశ్రీ , ఆలమూరు ఏడీ ఎల్.అనిత సూచించారు. అద్దంకివారిలంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో సమీప గ్రామాల నుంచి తరలించిన 480 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ సందర్శించారు. డాక్టర్ కె.వాణిశ్రీ , డాక్టర్ ఎల్.అనిత మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడతాయన్నారు. పాల దిగుబడి తగ్గడం, చూళి పోవడం తదితర ఇబ్బందులు సంభవిస్తాయన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకా వేయడమే మార్గమన్నారు. శిబిరంలో కాకినాడ ఏడీడీఎల్ డాక్టర్ ప్రవీణ్, కె.ప్రసన్న పశువైద్య సేవలందించారు.

ధాన్యం కొనుగోలుపై ముందస్తు ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుపై ముందస్తు ప్రణాళిక తయారు చేయటం జరిగిందని తహసీల్దార్ పి.తేజేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో జరిగిన కొనుగోళ్లలో జరిగిన సమస్యలను పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ స్థాయి అధికారుల నుంచి ఎదుర్కొనే సమస్యలు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. రబీలో సాగు చేయబడిన పంట రకాలు, వాటి దిగుబడుల అంచనా వేస్తామన్నారు. ఎంపీడీవో కీర్తి స్పందన మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్, సొసైటీ సీవోలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మండపేట: మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచి మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత -2023 అవార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. టాయిలెట్స్ నిర్వహణ, మురుగునీటిని శుద్ధీకరణ చేసి తిరిగి ఉపయోగించు పద్ధతులు, తడి పొడి చెత్త సేకరణ, చెత్తను తరలించు పద్ధతులు, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, చెత్త నుంచి సంపద తయారీ, చెత్తతో కళాకృతులు, సేంద్రియ ఎరువుతయారీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, సాంకేతికత, నూతన ఆవిష్కరణలు విభాగాల్లో కృషి చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్ తదితర విభాగాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 22వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అవార్డులను అందజేస్తామని కమిషనర్ రామ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలతోడు పుంత రోడ్డు పనులు ప్రారంభం



గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్న పుంతరోడ్డు

మండపేట: మండలంలోని తాపేశ్వరం - పాలతోడు పుంత రోడ్డు నిర్మాణ పనులను అధికారులు చేపట్టారు. రైతులతో పాటు తాపేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులు, గ్రామస్తులు మండపేట, తాపేశ్వరం వచ్చేందుకు సుమారు కిలో మీటరు పొడవైన ఈ పుంత రోడ్డు మీదుగా సైకిళ్లు, మోటారు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు ఎక్కడికక్కడ గోతులు, జిగురు మట్టితో ప్రమాద భరితంగా ఉంటుంది. వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి ఆదేశించారు. గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ నిధుల నుంచి రూ. 4 లక్షలు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.రెండు లక్షలు మంజూరు కాగా పంచాయతీ రాజ్ అధికారులు నిర్మాణ పనులు చేపట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని జేఈ నాగేశ్వరరావు తెలిపారు.

మార్కెట్‌లోకి సీజనల్ ఫ్రూట్స్

- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న వినియోగదారులు
- అందుబాటు రేట్లలో లభ్యం



రామాఫలాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



సీమచింతకాయలు, గులాబ్‌జామకాయలు

మండపేట: వేసవి ప్రారంభం కావడంతో మార్కెట్‌ను సీజనల్ ఫ్రూట్స్ ముంచెత్తుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు తీసుకు వచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. సీజన్‌లో మాత్రమే లభించే ఆయా రకాల పండ్లు కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎండలు ముదురు తుండడంతో ఇప్పటికే పుచ్చకాయలు మార్కెట్‌లోకి పోటెత్తాయి. రోడ్ల వెంబడి ఎక్కడ చూసిన పుచ్చకాయల విక్రయ దుకాణాలే కనిపిస్తున్నాయి. తాజాగా రామాఫలాలు, సీమచింతకాయలు, గులాబ్ జామకాయలు, దోసకాయలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. కరప మండలం గొర్రిపూడి, ఏజెన్సీ ప్రాంతాల్లో లభ్యమయ్యే రామాఫలాలను వ్యాపారులు తీసుకు వస్తున్నారు. ఎరుపు, పసుపు రంగుల కలయికలో ఉండే రామాఫలంలో గుంజు మాత్రం సీతాఫలంలానే ఉన్నప్పటికీ పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. గింజలు తక్కువగా ఉంటాయి. ఎంతో తియ్య ధనాన్ని కలిగి ఉంటుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే దొరికే వీటిని సైజును బట్టి డజను రూ.250 నుంచి రూ.400 వరకూ అమ్మకాలు చేస్తున్నారు. గోకవరం, చాగల్నాడు ప్రాంతాల నుంచి సీమచింతకాయలు తీసుకువచ్చి కిలో 100 నుంచి రూ.150 రేటుకు చిరు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వీటి కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గోదావరి లంకల్లో ఈ సీజన్‌లో పండే దోసకాయలకు గిరాకీ ఉంది. సైజును బట్టి కాయ ఖరీదు రూ.40 నుంచి రూ.100 వరకూ ఉంటున్నాయి. ఆరోగ్యానికి చలువ చేసే వీటిని పంచదారలో కలుపుకుని తినేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తుంటారు. లంకల్లో దొరికే ఖర్బూజాలు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 వరకూ రేటు పలుకుతున్నాయి. కడియం ప్రాంతంలో దొరికే గులాబ్ జామకాయలు డజను ఖరీదు రూ.50 వరకూ ఉంటున్నాయి. సీజనల్‌గా దొరికే ఆయా రకాల పళ్లను మార్కెట్లలోను, రోడ్ల పక్కన, సైకిళ్లపైనా తిరుగుతూ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు.



దోసకాయలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామచంద్రపురం రూరల్: ఈనెల 14న ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఎస్సై వినోద్ తెలిపిన వివరాల ప్రకారం వెలంపాలెం గ్రామానికి చెందిన మేడిది ఆనంతలక్ష్మి (34) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 14న పొలానికి వాడే గడ్డిమందు తాగింది. ఈమెను వైద్య కోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రితో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంగ్లిష్ పరీక్షకు 337 మంది హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 337 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రానికి 359 మంది విద్యార్థులను అలాట్ చేయగా 22 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీర వెంకట నాగేశ్వరరెడ్డి తెలిపారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం ప్రకారం శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన సహ విద్యార్థి తనను నమ్మించి, వశపరుచుకుని మోసం చేసినట్లుగా ఆ బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై సహ విద్యార్థిపై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

హాస్టల్ విద్యార్థిని మృతి

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్ విద్యార్థిని పులిదిండి మణికుమారి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెన్ కారణమని, వారిని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, దళితసంఘాల ప్రతినిధులు శుక్రవారం రాత్రి హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. రామచంద్రపురం మండలం హసనబాదకు చెందిన మణికుమారికి ఈనెల 13న వాంతులు కావడంతో వార్డెన్ ట్యాబ్లెట్ ఇచ్చారు. పరీక్షలు రాస్తున్న ఆమెకు మరుసటి రోజు వాంతులు కావడంతో వార్డెన్ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి సమస్య ఏమీ లేదని వైద్యులు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపేశారు. కాగా ఆమె పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. ఆమె మృతికి హాస్టల్ వార్డెనే కారణమని, ఆమెను, సోషల్ వెల్ఫేర్ డీడీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల ప్రతినిధుల ఆందోళన రాత్రి వరకు కొనసాగింది. ఆందోళనకారులతో డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ కృష్ణ, హాస్టల్ అధికారుల సంఘం నాయకులు ప్రసాద్‌బాబు దళిత సంఘాల ప్రతినిధులతో చర్చించారు.